నిర్మించారు.. వదిలేశారు

- రూ. లక్షలు ఖర్చు చేసినా నిష్ప్రయోజనం
- నిరుపయోగంగా వ్యవసాయ గోదాము
- వినియోగంలోకి తేవాలని రైతుల వేడుకోలు



పోచారంలో నిరుపయోగంగా ఉన్న గోదాము

పెద్దకొడప్‌గల్‌: మండలంలోని పోచారం గ్రామంలో 3,500 మెట్రిక్‌ టన్నుల సామర్థ్యంతో వ్యవసాయ గోదాము నిర్మించినా వాటిని వినియోగంలోకి తేవడంలో ఇటు పాలకులు అటు అధికారులు విఫలమయ్యారు. రూ.35 లక్షల వ్యయంతో నిర్మించిన గోదాంను 2018లో ప్రారంభించారు. వడ్ల సంజీవ్‌ అనే రైతుకు చెందిన రెండు గుంటల భూమిలో పదేళ్ల కిందట నిర్మించారు. ఉపాధి కల్పిస్తామని రైతులకు ఆశ చూపి అప్పట్లో స్థలాన్ని తీసుకున్నారు. గోదాము వినియోగంలోకి తీసుకరాక పోవడంతో రైతులకు ఏమాత్రం ప్రయోజనం లేకుండా పోయింది. పోచారం క్లస్టర్‌కు సంబంధించిన గ్రామాల రైతుల ప్రయోజనార్థం గోదాము నిర్మించినా నిరుపయోగంగా ఉంచడంతో పలు విమర్శలు విన్పిస్తున్నాయి. రైతుల కోసం నిర్మించిన గోదాము ఎలాంటి ప్రయోజనం లేకుండా నిష్ప్రయోజనంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గోదాం అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. ప్రధానంగా మొక్కజొన్న, జొన్న, పత్తి, కంది, సోయాబిన్‌, మినుములు, పెసర, శనగ పంట అధికంగా సాగు చేస్తారు. రైతులకు సరైన గిట్టుబాటు లేకపోయినప్పుడు గోదాములో నిల్వ చేసుకునే అవకాశం ఉన్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించాలని గోదామును వినియోగంలోకి తీసుకరావాలని రైతులు కోరుతున్నారు.

వినియోగంలోకి తేవాలి



పండించిన ధాన్యాన్ని గిట్టుబాటు లేని సమయంలో నిల్వ చేసుకునేందుకు గోదామును వినియోగంలోకి తేవాలి. లక్షలు ఖర్చు చేసి నిర్మించినా ప్రయోజనం లేదు.

– పవార్‌ కిషన్‌, పోచారం తండా

ఉపాధి కల్పించాలి



ఉపాధి కల్పిస్తామంటే పదేళ్ల కిందట రెండు గుంటల గోదాము నిర్మాణానికి ఉచితంగా ఇచ్చాను. ఉచితంగా స్థలం ఇస్తే అందులో ఉపాధి కాల్పిస్తామన్నరు. ఐదేళ్ల కిందట గోదాంను ప్రారంభించినా ఉపయోగంలోకి తీసుకరాలేదు.

– వడ్ల సంజీవ్‌, పోచారం

అభివృద్ధిని విస్మరించి సంబరాలా?



మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్‌ అలీ

నిజాంసాగర్‌ (జుక్కల్‌): రాష్ట్రంలో కాంగ్రెస్‌ అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని మాజీ మంత్రి షబ్బీర్‌ అలీ పేర్కొన్నారు. ఆదివారం ఆయన జుక్కల్‌లో కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు కైలాస్‌ శ్రీనివాస్‌ మేనల్లుడి వివాహానికి హాజరయ్యారు. అనంతరం స్థానిక కాంగ్రెస్‌ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాహుల్‌ గాంధీ నాయకత్వంలో రాష్ట్రం, కేంద్రంలో కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇళ్లు నిర్మించుకునే వారికి రూ. 5 లక్షలు మంజూరు చేస్తామన్నారు. రాష్ట్ర అభివృద్ధిని విస్మ రించిన సీఎం కేసీఆర్‌ దశాబ్ది ఉత్సవాల పేరిట సంబరాలు జరుపడం సిగ్గు చేటు అని విమర్శించారు. నాయకులు సొదాగర్‌ గంగారాం, వడ్డేపల్లి. సుబాష్‌రెడ్డి, గడుగు గంగాధర్‌ పాల్గొన్నారు.

చిన్నారుల ప్రతిభ

పిట్లం: మండల కేంద్రంలోని మసీద్‌ కమిటీ ఆధ్వర్యంలో చిన్నారులకు ఆదివారం జనరల్‌ నాలెడ్జ్‌, ఖురాన్‌కు సంబంధించి రాత పరీక్షలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన చి న్నారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మసీద్‌ కమిటీ అధ్యక్షుడు యాదు ల్‌ మాట్లాడుతూ వేసవి కాలంలో చిన్నారులకు ఖురాన్‌, జనరల్‌ నాలెడ్జ్‌పై ఇచ్చిన శిక్షణ అనంతరం పరీక్షలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో మసీద్‌ కమిటీ ఉపాధ్యక్షుడు రబ్బాని, కార్యదర్శులు ఆమేర్‌, అంజత్‌, షేక్‌ కరీం, హైమద్‌, గఫూర్‌, కలీం, అలీం తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

ఎల్‌వోసీ అందజేత



తాడ్వాయి: మండలంలోని చందాపూర్‌ గ్రామానికి చెందిన రాజ్యలక్ష్మి అనారోగ్యానికి గురికావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్‌ ఆస్పత్రిలో చేరారు. చికిత్సకు అయ్యే ఖర్చు సీఎంఆర్‌ఎఫ్‌ నుంచి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ రూ. 2.50 లక్షల విలువగల ఎల్‌వోసీని కార్యకర్తల ద్వారా బాధితురాలికి అందజేశారు. ఉప సర్పంచ్‌ లక్ష్మారెడ్డి, నాయకులు మంగారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, రాజిరెడ్డి, కిష్టారెడ్డి, గంగారాం పాల్గొన్నారు

బీజేపీలో పలువురి చేరిక



భిక్కనూరు: మండల కేంద్రానికి చెందిన యువజన సంఘాలకు చెందిన పలువురు నాయకులు ఆదివారం బీజేపీలో చేరారు. భిక్కనూరుకు చెందిన చంద్రశేఖర్‌గౌడ్‌, గంగళ్ల సురేశ్‌ ముదిరాజుల ఆధ్వర్యంలో 70 మంది బీజేపీలో చేరారు. బీజేపీ నియోజకవర్గం ఇంచార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఇన్‌చార్జి శ్రీధర్‌రడ్డి, మండల ఉపాధ్యక్షుడు అరిగే నర్సింలు, ఓబీసీ ఉపాధ్యక్షుడు ఉప్పర రమేశ్‌ పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎన్‌ పరిశ్రమను ముట్టడిస్తాం



భిక్కనూరు: ప్రాణాలకు ముప్పుగా ఉన్న ఎంఎస్‌ఎన్‌ కెమికల్‌ పరిశ్రమలను మూసివేయాలని డిమాండ్‌ చేస్తూ కాచాపూర్‌ గ్రామంలో చేపట్టిన నిరసన దీక్షలు 48వ రోజుకు చేరుకున్నాయి. మహిళలు ఆదివారం నిరసన దీక్షలో కూర్చొన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే పరిశ్రమను ముట్టడిస్తామని మహిళలు పేర్కొన్నారు.

ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్‌: కామారెడ్డికి చెందిన సీడ్స్‌ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్‌లో భాగంగా దోమకొండ కేంద్రంగా పని చేసేందుకు ఎంఎస్‌డబ్ల్యూ చదివిన వారు సీఈవో ఉద్యోగానికి దరఖాస్తులు కోరుతున్నట్టు సీడ్స్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ ఆర్‌వై గంగాధర్‌రావు తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ. 18 వేలు వేతనం చెల్లిస్తామన్నారు. వివరాలకు 9959907046 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పెద్ద వర్షాలు పడితేనే విత్తనాలు వేయాలి

బిచ్కుంద: పెద్ద వర్షాలు పడి భూమిలోని వేడి బయటకు వెళ్లిన తర్వాత విత్తనాలు విత్తుకోవాలని ఏవో పోచయ్య రైతులకు సూచించారు. దున్నిన భూమిలో లోతు వరకు తడిసి నీరు ఆరిన తర్వాత పెసర, మినుము, సోయా, కంది వేయాలన్నారు.

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం



సదాశివనగర్‌: క్రీడలలో గెలుపోటములు సహజమని దాతలు టేకిరాల రమేశ్‌రావు, శివగౌడ్‌లు అన్నారు. ఆదివారం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ క్రీడలలో రేవంత్‌ టీమ్‌ మొదటి బహుమతి కైవస చేసుకోగా, ద్వితీయ బహుమతిని రంజీత్‌ టీమ్‌ గెలుచుకుంది. మొదటి బహుమతది కింద రూ. 6 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ. 3 వేలు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్‌ దామోదర్‌ రావు, శివాజీరావు, సతీశ్‌ రావు, సంజీవ రావు, వడ్ల సురేశ్‌ పాల్గొన్నారు.

జాతీయస్థాయి గుర్తింపు

లింగంపేట: నాణ్యమైన విద్యను అందిస్తూ వినూత్న పద్ధతుల ద్వారా సర్వతో ముఖాభివృద్ధికి తోడ్పడుతున్న హమారీ మిట్టి విద్యాలయానికి జాతీయ స్థాయి గుర్తింపు లభించినట్లు వ్యవస్థాపకుడు రాజారాం శ్రీనివాస్‌ తెలిపారు. లింగంపేటలో ఆయన మాట్లాడుతూ తాడ్వాయి మండలం దేవాయిపల్లిలో ఉన్న విద్యాలయంలో రైతుల పిల్లలకు భరోసా కల్పిస్తూ ఉచిత విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. అనాథలు, పేద విద్యా ర్థులు, దివ్యాంగుల పిల్లలకు ఉచిత విద్యను అందిసున్నట్లు తెలిపారు. ఉపాధి అవకాశాలకు జూట్‌ బ్యాగులు, టైలరింగ్‌, ఫ్యాషన్‌ డిజైన్‌, స్పోకెన్‌ ఇంగ్లీష్‌ తదితర విషయాలపై శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో ఆర్థిక భరోసా



చెక్కులను పంపిణీ చేస్తున్న గంప గోవర్ధన్‌

కామారెడ్డి క్రైం: సీఎంఆర్‌ఎఫ్‌ పథకం ద్వారా నిరుపేదలకు ఆర్థిక భరోసా లభిస్తోందని ప్రభుత్వ విప్‌ గంప గోవర్ధన్‌ అన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 71 మందికి మంజూరైన రూ.22.24 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను కామారెడ్డిలోని ఆయన నివాసం వద్ద ఆదివారం పంపిణీ చేశారు. మరో 10 మందికి వైద్య చికిత్సల నిమిత్తం రూ.17.60 లక్షల విలువైన ఎల్‌వోసీని అందజేశారు. వివిధ కారణాలతో మృతి చెందిన రాజంపేట్‌కు చెందిన మెత్తల అశోక్‌, డెబ్బల రవి, మాచారెడ్డి మండలం గజ్యానాయక్‌ తండాకు చెందిన కొడిమ్యల రాజయ్య, కామారెడ్డికి చెందిన జెంక రవి కుటుంబానికి రూ. 2 లక్షల చొప్పున బీమా చెక్కులను అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ పున్న రాజేశ్వర్‌, ఎంపీపీలు పిప్పిరి ఆంజనేయులు, గాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, అధికార ప్రతినిధి బల్వంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు రుణం ఇవ్వాలి



మాట్లాడుతున్న చేనేత సంఘం అధ్యక్షుడు మరగల దయానంద్‌

పిట్లం: కులవృత్తుదారులకు ప్రభుత్వం ప్రకటించిన రూ. లక్ష సాయం చేనేత కార్మికులకు కూడా వర్తింజేయాలని మండల చేనేత సంఘం అధ్యక్షుడు మరగల దయానంద్‌ డిమాండ్‌ చేశారు. ఆదివారం సంఘ సభ్యులు పిట్లంలో సమావేశమయ్యారు. అనంతరం దయానంద్‌ మాట్లాడుతూ చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని దీంతో చేనేత కార్మికులకు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు లోక శ్రీనివాస్‌, లోక సంతోష్‌, శివ, మర్గల కృష్ణ, రాములు, రమేష్‌, ప్రేమ్‌ తదితరలు పాల్గొన్నారు.

ఇసుక రవాణా అడ్డగింత



నిలిపివేసిన ఇసుక వాహనాలు

మద్నూర్‌: మండలంలోని కుర్లా గ్రామ సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను స్థానికులు అడ్డుకొని తహసీల్దార్‌, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో భయపడిన ఇసుక టిప్పర్ల డ్రైవర్లు ఇసుకను మంజీర వాగు వద్ద అన్‌లోడింగ్‌ చేసి అక్కడి నుంచి పారిపోయారు. మంజీర వాగులో ఇష్టారాజ్యంగా జేసీబీలతో ఇసుకను తోడేయడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయని గ్రామస్తులు ఆరోపించారు.

రన్‌కు తరలిరండి

పిట్లం/ఎల్లారెడ్డి/లింగంపేట/మద్నూర్‌: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమ వారం ఉదయం 6 గంటలకు పోలీస్‌ శా ఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ రన్‌కు ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిట్లం ఎస్సై విజయ్‌ కొండ కోరారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హన్మంత్‌ షిండే పాల్గొంటారని ఎస్సై తెలిపారు. ఎల్లా రెడ్డిలో నిర్వహించనున్న కార్యక్రమానికి ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ హాజరవుతారని బీఆర్‌ఎస్‌ నాయకులు వెల్లడించారు. బిచ్కుందలో నిర్వహించనున్న రన్‌కు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని మద్నూర్‌ ఎస్సై కృష్ణారెడ్డి కోరారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



ఎల్లారెడ్డిలో సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

ఎల్లారెడ్డిరూరల్‌: పింఛన్‌ రూ. 4,016 పెంచుతూ సీఎం కేసీఆర్‌ నిర్ణయం తీసుకోవడంతో దివ్యాంగులు ఆదివారం స్థానిక తెలంగాణ తల్లి ప్రాగంణంలో సీఎం కేసీఆర్‌, ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌, ఆదిమూలం సతీష్‌ తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరులో..

భిక్కనూరు: జిల్లా దివ్యాంగుల విజ్ఞాన సేవా సంస్థ ఆధ్వర్యంలో భిక్కనూరులో పలువురు దివ్యాంగులు సీఎం కేసీఆర్‌ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సర్పంచ్‌ తున్కి వేణు, దివ్యాంగుల విజ్ఞాన సేవ సంస్థ జిల్లా అధ్యక్షుడు పుర్ర బాల్‌రెడ్డి, సభ్యులు ఆడేపు నాగరాజు, ఇస్కానిపేట రాజు. సంతోశ్‌ రెడ్డి, సిద్ధగౌడ్‌, కిరణ్‌ ఎండీ ఆహ్మద్‌ పాల్గొన్నారు.

పైపులైన్‌ లీకేజీని అరికట్టరూ!



పెద్దకొడప్‌గల్‌: తాగునీటి పైపులైన్‌ లీకేజీని అరికట్టి కాలుషిత నీరు రాకుండా చూడాలని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని శివాపూర్‌ శివారులో పైప్‌లైన్‌ కొన్ని రోజులుగా లీకేజీ అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సంక్షిప్తం

హాస్టల్‌లో నేరుగా ప్రవేశాలు

మద్నూర్‌: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో చేరాలనుకునే వారు నేరుగా వచ్చి కలువాలని వార్డెన్‌ సందీప్‌ పేర్కొన్నారు. 8 నుంచి పదో తరగతి వరకు హాస్టల్‌లో ఎలాంటి పరీక్ష లేకుండానే చేరవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలురు అర్హులన్నారు. వివరాలకు 9640848334 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

163 కేసులు పరిష్కారం

లింగంపేట: ఎల్లారెడ్డి కోర్టు పరిధిలో శనివారం నిర్వహించిన లోక్‌ అదాలత్‌లో 163 కేసులు పరిష్కారమైనట్లు ఎస్సై శంకర్‌ తెలిపారు.

నేడు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ

సదాశివనగర్‌: పాఠశాలలు సోమవారం నుంచి ప్రారంభం అవుతున్న దృష్ట్యా విద్యార్థులకు సోమవారం పాఠ్యపుస్తకాలు అందజేయనున్నట్లు ఎంఈవో యోసెఫ్‌ తెలిపారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు



కామారెడ్డిలో కురుమ విద్యార్థులకు జ్ఞాపికను అందజేస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్‌: టెన్త్‌, ఇంటర్‌లో అధిక మార్కులు సాధించిన కురుమ విద్యార్థులకు కురుమ యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో ఆదివారం కామారెడ్డిలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సంజీవ్‌కుమార్‌ మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు, పేరుప్రతిష్టలు వస్తాయని అన్నారు. కురుమ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ పెద్దోళ్ల మహేష్‌, జిల్లా గొర్రెల మేకల పెంపకందార్ల సంఘం అధ్యక్షుడు మర్కంటి భూమన్న, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్కంటి బుచ్చన్న, సదాశివనగర్‌ ఎంపీటీసీ పాపనోల్ల బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులను చదివిస్తా..



బాన్సువాడలో విద్యార్థులకు జ్ఞాపికను అందజేసిన మున్నూరు కాపు సంఘం నేతలు

బాన్సువాడ: మున్నూరు కాపుల అభ్యున్నతికి ఎల్లవేళలా కృషి చేస్తానని , పేద విద్యార్థుల చదువుకు అయ్యే ఖర్చులు భరిస్తానని కాంగ్రెస్‌ బాన్సువాడ నియోజకవర్గం ఇంచార్జి కాసుల బాలరాజు అన్నారు. టెన్త్‌, ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మున్నూరు కాపు సంఘ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. అనంతరం బాలరాజు మాట్లాడుతూ పేద మున్నూరు కాపు ఆడబిడ్డల పెళ్లిళ్లకు అయ్యే ఖర్చు భరిస్తానన్నారు. మహారాష్ట్రలో మాదిరిగా తెలంగాణలోనూ మున్నూరు కాపులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్‌ చేశారు. కులవృత్తులకు ప్రకటించిన ఆర్థికసాయంలో మున్నూరు కాపులను ప్రభుత్వం విస్మరించి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. మున్నూరు కాపులు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మామిళ్ళ అంజయ్య, పెటిగడ్డ అంజయ్య, రాష్ట్రనాయకులు ఉగ్గె శ్రీనివాస్‌, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక..

■ కుమ్మరి సంఘం



మద్నూర్‌: మండల కుమ్మరి (శాలివాహన) సంఘం కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా అధ్యక్షుడు కుమ్మరి రాములు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కొడిచల్ల గంగాధర్‌, మండల అధ్యక్షుడిగా విజయ్‌కుమార్‌, ఉపాధ్యక్షుడిగా సంజు, ప్రధాన కార్యదర్శిగా విఠల్‌, కోశాధికారిగా సచిన్‌ ఎన్నికయ్యారు. అదేవిధంగా సహాయ ఉపాధ్యక్షుడిగా అశోక్‌, సలహాదారులుగా లక్ష్మన్‌, వీరన్నను ఎనుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌, ఉపాధ్యక్షుడు దర్పల్లి శివకుమార్‌, గంగాధర్‌, చిన్న వీరేశం, హన్మండ్లు, అశోక్‌, సాయినాథ్‌, రామ్‌, మారుతిపాల్గొన్నారు.

■ పద్మశాలి సంఘం



దోమకొండ: పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడిగా మ్యాక నాగరాజు ఎన్నికయ్యారు. ఆదివారం మార్కండేయ మందిరంలో జరిగిన సమావేశంలో నూతన కమిటిని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఐరేని రాజేందర్‌, బొమ్మెర ప్రవీణ్‌కుమార్‌, కుందెన వినోద్‌కుమార్‌, ప్రధాన కార్యదర్శి బొమ్మెర గంగధర్‌, సహయ కార్యదర్శులుగా కూచని జగదీష్‌, చాట్ల అనిల్‌, శ్రీగాద మహదేవ్‌, కోశాధికారి అందే గణేష్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా టీచర్‌ నర్సయ్య, వడ్లకొండ రవీందర్‌ వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ ఐరేని నర్సయ్య, జిల్లా ప్రతినిధులు గణేష్‌, సిద్ధరాములు ఉన్నారు.

నేడు ప్రభుత్వ విప్‌ గంప గోవర్ధన్‌ రాక

దోమకొండ: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్‌ కార్యాలయాలన్ని ప్రభుత్వ విప్‌ గంప గోవర్ధన్‌ సోమవారం ప్రారంభిస్తారని బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు మధుసూధనరావు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ముత్యంపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయితీ భవనాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

ఆధ్యాత్మికం

■ వైభవంగా పోచమ్మ ఉత్సవాలు



దోమకొండ: పోచమ్మ ఉత్సవాల్లో భాగంగా దోమకొండలో అమ్మవారికి బోనాలు తీశారు. ప్రతి ఇంటి నుంచి బోనాలను అమ్మవారికి సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో మాజీ మంత్రి షబ్బీర్‌ అలీ పాల్గొని పట్టు వస్త్రాలు సమర్పించారు. కామారెడ్డి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌ రెడ్డి, కార్యదర్శి అబ్రబోయిన స్వామి, మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, ఆలయకమిటీ ప్రతినిధులు బాల్‌రాజ్‌, నర్సింలు, తిర్మల్‌, ఎల్లయ్య, కిష్టయ్య, ధర్మరాజు పాల్గొన్నారు.

■ వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు



నాగిరెడ్డిపేట: వర్షాలు పుష్కలంగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ మండలంలోని బంజార తండాలోని సేవాలాల్‌ మందిరం వద్ద గిరిజనులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్‌ మహారాజ్‌, జగదాంబ మాతకు నైవేద్యం సమర్పించారు.

■ గ్రామ దేవతలకు బోనాలు

నాగిరెడ్డిపేట: మండలంలోని పోచారం గ్రామ దేవతలైన నల్ల పోచమ్మ, ఎల్లమ్మ, దుర్గమ్మ, గంగమ్మ, ఊరడమ్మకు గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో బోనాలను సమర్పించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్‌ విజిత రెడ్డి పండుగకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.



హరితహారం చెట్లకు నిప్పు



కొయ్యగుట్ట శివారులో రోడ్డు పక్కన కాలిపోయిన చెట్లు

బాన్సువాడ రూరల్‌: హరితహారం పథకం కింద నాటిన మొక్కలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలిపోయాయి. స్థలాలను కాజేయాలనే ఉద్దేశంతోనే వాటికి నిప్పు పెడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెట్లను నిప్పు పెట్టినవారిని గుర్తించినా ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో ఘటనలు పునరావృతం అవుతూనే ఉన్నాయి.